క్లుప్తంగా

బహిరంగ వేలం వాయిదా

ప్రొద్దుటూరు : స్థానిక తాత్కాలిక దిన కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్, మాంసం, చేపల మార్కెట్‌లలో రుసుం వసూలు చేసుకొనుటకు, తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లోని క్యాంటిన్ నిర్వహణకు గుత్త హక్కుకై శనివారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. తదుపరి బహిరంగ వేలం ఈనెల 25న మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

ఖాజీపేట : ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి తీరని నష్టం కలుగుతోందని, ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఖాజీపేట పంచాయితీ సెక్రటరీ రమణారెడ్డి దుకాణాదారులకు విజ్ఞప్తి చేశారు. ఖాజీపేట మేజర్ పంచాయితీలోని పలు దుకాణాలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కల్గే అపర్థాల గురించి వారికి కరపత్రాల ద్వారా వివరించారు. ప్లాస్టిక్ రహిత ఖాజీపేటగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనాథ పిల్లలకు అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పద్మవిభూషణ్ మెగాస్టార్ పవర్ స్టార్ ఫ్రెండ్స్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వాత్సల్య అనాథ శరణాలయంలో శనివారం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రామ్ చరణ్ ఆయురారోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు సేవా సమితి నాయకులు తెలిపారు. సేవా సమితి నాయకులు రామారావు, చంద్రధర్, మధు చిరురాయల్, షరీఫ్, జనసేన అడ్వకేట్ రమేష్, మెడికల్ శ్రీను, రాజు, కేశవ, సాగర్, హిమమ్, బాబురావు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లీ.. చల్లంగ చూడమ్మ


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా జరుగుతోంది. రెండో రోజు శనివారం ప్రత్యేక అలంకారంలో పెద్దమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు చల్ల తీసుకుని వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి.. పెద్దమ్మ తల్లీ.. చల్లంగ చూడమ్మ అని వేడుకున్నారు. ఆదివారం బోనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం పెద్దమ్మ తల్లి, చిన్నమ్మ తల్లి, గాలి దేవరలను ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర గట్టున చేరుస్తారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి తిరునాల


చౌడేశ్వరి దేవి

ఖాజీపేట : ఖాజీపేట మండలం కొమ్మలూరు గ్రామంలో వెలసిన రామలింగ చౌడేశ్వరి దేవి తిరునాల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వృషభాల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

అట్లూరు: రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ-పంట నమోదు తప్పనిసరి అని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన అట్లూరు, బద్వేలు, గోపవరం, సిద్దవటం మండల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యాంత్రీకరణ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ ఆధారిత పనిముట్లు కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

మైదుకూరు : నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డ్వామా ఏపీడీ సుబ్బారెడ్డి అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

బద్వేలు అర్బన్ : మహిళలపై దాడి చేసిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాలవీధికి చెందిన కుంభగిరి గురుతరుణ్ అనే యువకుడు ఈ నెల 19న మద్యం మత్తులో ఇంటి బయట ఉన్న మహిళలపై దాడి చేసి గాయపరిచాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలుకు పంపినట్లు ఆయన తెలిపారు.

చెత్తశుద్ధిపై.. ఏది చిత్తశుద్ధి


తుదుమలదిన్నె గ్రామంలో నిరుపయోగంగా చెత్తశుద్ధి కేంద్రం


పుల్లూరులో నిరుపయోగంగా ఉన్న షెడ్డు


తుదుమలదిన్నె చెత్తశుద్ధి కేంద్రంలో కంపచెట్లు


మిడుతూరులో శిథిలమై పగుళ్లు ఏర్పడిన షెడ్డు

గ్రామాలను స్వచ్ఛ నిలయాలుగా మార్చేందుకు పంచాయతీల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తశుద్ధి కేంద్రాలు (సెగ్రిగేషన్ షెడ్లు) నిరుపయోగంగా మారాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో లక్ష్యం నెరవేరకుండా పోతోంది. మండలంలోని ఖాజీపేట, భూమాయపల్లె పంచాయితీల్లో మినహా అన్ని పంచాయితీల్లో నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు వీటిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. – ఖాజీపేట

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన మహేశ్వర్‌రెడ్డి

చాపాడు: మండల కేంద్రమైన చాపాడు సమీపంలోని సీతారామాపురం క్రాస్ రోడ్డులో శనివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి ప్రొద్దుటూరు నుంచి సీతారామాపురం క్రాస్ రోడ్డులోకి క్రాస్ అవుతుండగా, ఇదే క్రమంలో వెనక వైపు నుంచి వస్తున్న భూమిరెడ్డి గురుమహేశ్వర్‌రెడ్డి బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేశ్వర్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కాగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

డీలర్‌పై జేసీకి ఫిర్యాదు

కలసపాడు : మండలంలోని కర్ణంవారిపల్లె రేషన్ డీలర్‌పై అదే గ్రామానికి చెందిన బత్తుల మల్లికార్జున శనివారం కడపలోని జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. రేషన్ బియ్యాన్ని స్వాహా చేసిన డీలర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

త్యాగమూర్తుల స్ఫూర్తి అందరికీ ఆదర్శం


రాజంపేట స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు : దేశం స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రాజంపేట స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వికసిత ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన షహీద్ దివస్ కార్యక్రమంలో భాగంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రాజంపేట స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జయరాంరెడ్డి, ఆచార్య కేవీ రమణయ్య, ఆచార్య పి.నాగరాజు, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, పి.సంతోష్‌కుమార్, షఫీవుల్లా బాషా, వెంకటసౌజన్య, సుబ్బయ్య, రవి, రజియ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు

బద్వేలు అర్బన్ :భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, పట్టణ నాయకులు వెంకటరమణ, నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు


బోరును పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం పంచాయితీ నిధులతో కొత్త మోటారును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు మోటారు రిపేరు చేయించామని, నెలలో నాలుగుసార్లు మోటర్ కాలిపోయిందని సర్పంచ్ తెలిపారు. అయితే గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించామని టీడీపీ నాయకుడు రితీష్‌రెడ్డి ప్రతికాప్రకటన ఇవ్వడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

గోపవరం : పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఈఓపీఆర్‌డీ హసీనా పేర్కొన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధిలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఇంటి వద్దకు చెత్తసేకరణ కోసం హరిత రాయబారులు రావడం జరుగుతుందని, తడి, పొడి చెత్తను అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోశ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, అంకాలమ్మ

పోరుమామిళ్ల: రెడ్డినగర్‌లో వెలసిన పోలేరమ్మ, అంకాలమ్మ జాతర శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవార్లకు మహిళలు పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, కాయ కర్పూరం సమర్పించారు.

వృద్ధాశ్రమానికి కూలర్లు వితరణ


కూలర్లు వితరణ చేస్తున్న కేపీసీ ప్రాజెక్టు ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: కేపీసీ ఫౌండర్ కేసీ పుల్లయ్య 13వ వర్ధంతి సందర్భంగా కేపీసీ ప్రాజెక్టు డీజీఎం శ్రీదర్, సీనియర్ ప్రొడక్షన్ మేనేజర్ జగదీష్‌లు వృద్ధాశ్రమానికి శనివారం కూలర్లను వితరణ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు కేపీసీ ఫౌండర్ కేసీ.పుల్లయ్య చిత్రపటానికి కేపీసీ ప్రాజెక్టు సిబ్బంది పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలాదేవి

కలసపాడు : వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో చెత్తసంపద కేంద్రాల నిర్వహణ సరిగా లేదని, వాటిని సక్రమంగా పర్యవేక్షించాలన్నారు. మండలంలో 34 మినీ గోకులాలు మంజూరైతే పశువులు లేని వారికి గోకులాలు ఎలా ఇచ్చారని రాజుపాలెం సర్పంచ్ సూదారామకృష్ణారెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందడం లేదని, అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మల్లువారిపల్లె, రాజుపాలెం గ్రామాల మధ్యలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పీటీసీ గురివిరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, మండల ఉపాధ్యక్షుడు ఎ.వి.భాస్కర్‌రెడ్డి, పీఆర్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం, పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ఉపాధి ఏపీఓ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమిషన్ డైరెక్టర్ ఎస్.గ్రిప్, కెనరా బ్యాంక్ లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.జనార్దన్ తెలిపారు. ప్రొద్దుటూరు మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ప్రధాన మంత్రి ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల మహిళలకు 35 శాతం, పట్టణ ప్రాంత మహిళలకు 25 శాతం సబ్సిడీతో యూనిట్లను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటసుబ్బమ్మ, డీపీఓ కృష్ణ, ఏడీ కోటిరెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు రూరల్ : విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణ ఆపి ప్రభుత్వమే నడపాలని ఈనెల 24న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పాతబస్టాండ్‌లోని ఆర్టీసీ బస్సుల వద్ద బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు ఆర్టీసీ విస్తరణకు పెను ప్రమాదంగా మారిందన్నారు.ఈ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, శాంతి, బాబు, డేవిడ్, శీను పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి


మాట్లాడుతున్న కేవీఐసీ డైరెక్టర్ మదన్‌కుమార్‌రెడ్డి

చాపాడు: చదువుకున్న విద్యార్థులు నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు కుటీర పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని కేవీఐసీ డైరెక్టర్ మదన్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కాలేజీలో శనివారం ఖాదీ విలేజ్ అండ్ ఇండస్ట్రియల్ కమిషన్, ఎంటర్‌ప్రెనర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కేవీఐసీ డైరెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యలను ఎదుర్కొంటున్న చదువుకున్న యువత కుటీర పరిశ్రమల స్థాపనకు ముందుకురావాలన్నారు. యువతకు తమకు ఆసక్తి, ఇష్టంగా ఉండే కుటీర పరిశ్రమలను ఎంచుకుని వాటిలో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి, కేవీఐసీ జిల్లా డైరెక్టర్‌లు చాన్‌బాషా, జనార్దన్ రెడ్డి, అసిస్టెంటు డైరెక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

అభ్యాస కేంద్రాలుగా మార్చాలి

మైదుకూరు : పోషణ్ బీ- పడాయి బీ కార్యక్రమం ద్వారా పొందిన శిక్షణతో అంగన్‌వాడీ కార్యకర్తలు అంగన్‌వాడీ కేంద్రాలను అభ్యాస కేంద్రాలుగా మార్చాలని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మూడు రోజులుగా పోషణ్ బీ - పడాయి బీ పేరుతో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఆధార్ శీల, నవచేనత కార్యక్రమాలతో 0-3 సంవత్సరాల, 3-6 సంవత్సరాల పిల్లలకు పోషణతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని సూచించారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

గోపవరం : లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ (పోక్సో చట్టం)పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాలువపల్లె పంచాయతీ పరిధిలోని లక్కవారిపల్లె గ్రామంలో హైకోర్టు ఆదేశాలు, జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ కోర్టు కాంప్లెక్స్ బద్వేలు వారి ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఎలా ఉంటుంది, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఏవిధంగా నడుచుకోవాలో వివరించారు.. సదస్సులో బార్ ప్రెసిడెంట్ బి.వి.ఎస్.క్రిష్ణ, న్యాయవాదులు శ్రీనివాసులు, చక్రధర్, ఏఎస్ఐ చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థినులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి కె సత్యకుమారి తెలిపారు. మున్సిపల్ గ్రౌండ్‌లోని బీసీ మహిళా వసతి గృహాన్ని శనివారం జడ్జి తనిఖీ చేశారు. విద్యార్థినులకు పోక్సో చట్టం గురించి వివరించారు. అనంతరం సబ్‌జైలును పరిశీలించారు. ఖైదీల సమస్యలు, వారి కేసులను గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ సురేష్,సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతిభగల పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కేసీ పుల్లయ్య ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొనియాడారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శనివారం కేసీ పుల్లయ్య 13వ వర్ధంతి సంస్మరణ సభ, ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కేసీ పుల్లయ్య స్మారక పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణవేణమ్మ, సుశీల్‌కుమార్, సీఈఓ చల్లా సుధ, వ్యాపారవేత్త వంకదార వీరభద్రయ్య, ప్రణవ్ గ్రూప్ వ్యవస్థాపకుడు రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ


ఇన్వర్టర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహానికి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఇన్వర్టర్‌ను వితరణగా ఇచ్చారు. ఇటీవల అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1983–84 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగినప్పుడు సమస్యను గుర్తించి పూర్వ విద్యార్థులు సుధాకృష్ణార్జునరెడ్డి మిత్ర బృందం 32 మంది రూ.26,366తో ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేశారు. వార్డన్ మనోరాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల డీన్ కొట్టడంతో విద్యార్థికి గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌లో డీన్‌గా పని చేస్తున్న గణేష్‌రెడ్డి కొట్టడంతో 9వ తరగతి విద్యార్థి సాత్విక్‌రెడ్డి గాయాలయ్యాయి. ఆర్టీపీపీ నుంచి సాత్విక్ ఒక్కడే బస్సులో స్కూల్‌కు వస్తుండేవాడు. ఒక్కడి కోసం బస్సు రావడం కుదరదని భావించిన స్కూల్ యాజమాన్యం ఆర్టీపీపీకి కొన్ని రోజుల క్రితం బస్సు రద్దు చేసింది. ఈ విషయమై పాఠశాల యాజమాన్యం, విద్యార్థి కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సాత్విక్‌రెడ్డి ఇతర విద్యార్థులకు ఇన్‌స్టాగ్రాంలో మెసేజ్ చేశాడనే కారణంతో శుక్రవారం డీన్ గణేష్‌రెడ్డి పైప్‌తో విద్యార్థిని కొట్టడంతో ఒంటిపై కమిలిన గాయాలయ్యాయి. బాలుడి తండ్రి మాధవరెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

దేవసాని గోవిందరెడ్డికి ఘన నివాళి


కాశినాయన : దేవసాని గోవిందరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ


దువ్వూరు : జయలక్ష్మిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కాశినాయన : ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, జెడ్పీటీసీ డి. సత్యనారాయణరెడ్డి తండ్రి దేవసాని గోవిందరెడ్డి ఐదవ వర్ధంతిని మండలంలోని వరికుంట్ల గ్రామంలో శనివారం నిర్వహించారు. గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు గోవిందరెడ్డి సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, బి.కోడూరు సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మిద్దెల సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, పెద్ద సత్యంరెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే

దువ్వూరు : మండలంలోని మదిరేపల్లె గ్రామానికి చెందిన సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు నారుపల్లె జయలక్ష్మిరెడ్డి శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శనివారం మదిరేపల్లెలో జయలక్ష్మిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, దువ్వూరు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నారుపల్లె అంకిరెడ్డి, ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, ముదుమాల శివశంకర్‌రెడ్డి, నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ హెచ్చరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అర్బన్ ఎస్ఐ ఎం.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

రాజుపాళెం : రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. రాజుపాళెంలోని పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలను నడిపే వారంతా హెల్మెట్ ధరించి అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

కలసపాడు : వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్ఐ ఘనమద్దిలేటి తెలిపారు. శనివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

హెల్మెట్ ధరించాలి

చాపాడు: బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని వీటి వలన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని ఎస్ఐ చిన్న పెద్దయ్య పేర్కొన్నారు. మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు సమీపంలో గల ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద శనివారం సాయంత్రం రోడ్డు ప్రయాణికులకు హెల్మెట్ వాడకం, వాటి వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

హెల్మెట్ ప్రాణానికి రక్ష

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ ప్రాణానికి రక్షణ ఇస్తుందని టూటౌన్ ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మదూరు రోడ్డులో శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ గురించి ఎస్ఐ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే రూ. 1,000 జరిమానా విధిస్తామన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు

మైనర్లు బైక్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ ఎస్ఐ ధనుంజయ తెలిపారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడితే తల్లిదండ్రులను బాధ్యులను చేస్తామన్నారు.